
క్లుప్తంగా

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు విశేషంగా నిర్వహించారు. అర్చకులు స్వామిని పలురకాల పుష్పాలతో అలంకరించి దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కేసు నమోదు

సబ్బవరం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు సోమవారం తెలిపా. పలు బహిరంగ ప్రదేశాల్లో ఆదివారం రాత్రి మద్యం సేవిస్తూ పట్టుబడిన 8 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.అలాగే మండలంలోని ప్రధాన కూడళ్లలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలతో పట్టుబడిన ఇద్దరిపై కూడా కేసు నమోదు చేశామన్నారు.అలాగే నిబంధనలు మీరి వాహనాలు నడిపిన 158 మందికి మోటారు వాహనాల చట్టం ప్రకారం చలానాలు విధించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆచార్య సూర్యనారాయణకు సత్కారం


సూర్యనారాయణను సత్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు,అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు

సబ్బవరం: తెలుగు భాష అభివృద్ధికి పలు సలహాలు,సూచనలు అందించినందుకు సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ ఎస్. సూర్యనారాయణకు అరుదైన గౌరవం లభించింది. విజయవాడలో నిర్వహించిన తెలుగు భాషోత్సవాల్లో భాగంగా ఆయన చేసిన సేవలకు గానూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు,అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయ బాబు అభినందనలు తెలియజేసి ఘనంగా సత్కరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


లంకా ముత్యాల రావు (ఫైల్)

సబ్బవరం: మండలంలోని నంగినారపాడు శివారు లంకివానిపాలేనికి చెందిన ఒక వ్యక్తి మనస్థాపంతో పురుగుల మందు తాగి మృతిచెందాడు.స్థానిక ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లంకివానిపాలేనికి చెందిన లంకా ముత్యాలరావు(58) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య నాలుగు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి లంకా ముత్యాలరావు మనస్థాపం చెందడంతో ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు గుర్తించి 108లో కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుమారుడు లంకా రామప్రసాద్ సోమవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: సింహాద్రి జంక్షన్‌లోని ఓ పాన్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పరవాడ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకొన్నారు. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సింహాద్రి కూడలిలోని పాన్‌షాపులో గొర్లి రామారావు మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు సోమవారం ఉదయం 11.30 సమయంలో దాడి చేశారు. 12 మద్యం సీసాలు (180 ఎంఎల్) పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని రామారావుపై కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- గవర జగ్గయ్యపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


గవర జగ్గయ్యపాలెంలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు.జీవీఎంసీ 88వ వార్డు పరిధి గవరజగ్గయ్యపాలెంలో సోమవారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధికి పెద్దపీట

ఈ సందర్భంగా రూ. 60 లక్షలతో రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు సంక్షేమ పథకాల ద్వారా వార్డు ప్రజలకు రూ.7 కోట్లు అందించినట్టు చెప్పారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండుకళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో పేదలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్నప్పుడు ప్రజలు చెబుతున్న మాటలు తమకు సంతోషం కలిగిస్తున్నాయన్నారు. అవినీతికి తావులేకుండా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంతమంది జట్టు కట్టినా ప్రజలు సంక్షేమ సారథి అయిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటారన్నారు. కార్యక్రమంలో 88వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గంధ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, నాయకులు మళ్ల నూక అప్పారావు, బుల్లిబాబు, స్వామినాయుడు, గృహసారథులు,జీవీఎంసీ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


మొక్కనాటుతున్న సర్పంచ్ పార్వతి, వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి తదితరులు

సబ్బవరం: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి అన్నారు. మండలంలోని ఆరిపాక శివారు పెదయాతపాలెం గ్రామంలో శేషమయ్య చెరువు గట్టుపై,నూకాలమ్మ ఆలయం వద్ద సర్పంచ్ పాలిశెట్టి పార్వతితో కలిసి సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం చెట్లను సంరక్షించడం అవసరమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పెంపకం చేపట్టడం ద్వారా పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చన్నారు. 200కు పైగా కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, సచివాలయ కన్వీనర్ శరగడం రాము,ఉప సర్పంచ్ శరగడం శ్రీనివాసరావు,పార్టీ బొడ్డేటి మహలక్ష్మినాయుడు, గ్రామ పెద్దలు కాళ్ల శ్రీను, బొడ్డేటి కాశీ,మళ్ల బాలాజీ,రేబాక బాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు అవగాహన సదస్సు

కంచరపాలెం : ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు తయారీ, సేవా పరమైన యూనిట్లు ఏర్పాటుపై అవగాహన సద"స్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి తెలిపారు. కంచరపాలెం ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఐటీఐఎటీ కార్యాలయంలో మంగళవారం ఉద యం 10 గంటలకు అవగాహన సదస్సు ఉందన్నారు. ఆసక్తి గల అర్హత అభ్యర్థులు kvic onine.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకొని సదస్సు రావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు ప్రభాకర్

కూర్మన్నపాలెం: వడ్లపూడి బ్రిడ్జి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి.. పెందుర్తిలోని చీమలాపల్లి గ్రామానికి చెందిన ఎం.ప్రభాకర్(50), చింతల అగ్రహారం గ్రామానికి చెందిన పాలమరశెట్టి సురేష్ సోమవారం ద్విచక్రవాహనంపై అనకాపల్లి నుంచి గాజువాక పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పని చూసుకుని సాయంత్రం తిరిగి వెళ్తూ మద్యం సేవించిన వీరు వడ్లపూడి బ్రిడ్జి దగ్గర ఓ కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. దీంతో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న ప్రభాకర్ ముందుకు తూలిపడడంతో తలకు బలమైన గాయమైంది. దగ్గరలోని అగనంపూడి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రభాకర్ మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు జీతంతోపాటే నైట్ అలవెన్స్

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు దామోదరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు దామోదరరావు

అల్లిపురం: ఆర్టీసీ ఉద్యోగులకు త్వరలో ఓటీ, నైట్ అలవెన్స్‌లు ప్రతీ నెలా జీతంతోపాటే చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు వలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్, విశాఖ, అనకాపల్లి జిల్లాల ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశం సోమవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ ట్రీట్‌మెంట్ విషయంలో గతంలో మాదిరిగా కార్పొరేట్ వైద్యం, కార్పొరేషన్ భరించే విధంగా మళ్లీ పునరుద్ధరించే విధంగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నందమూరి రామారావు విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేఎస్ఎస్ మూర్తి, డీఎల్.రాజు, విజయనగరం జోన్ జోనల్ అధ్యక్షుడు కేజే శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, రాష్ట్ర మెయింటెనెన్స్ కమిటీ సభ్యుడు జి.శ్రీనివాసరావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శి కే శ్రీనివాసరావు, డీఎస్ఎన్ మూర్తి, జోనల్ నాయకులు, ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి


బస్సు దిగి జీవీఎంసీకి నడిచి వస్తున్న మేయర్

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయినందున, వాటి నియంత్రణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.

కార్మికులను దెబ్బకొట్టడానికే ప్రైవేటీకరణ


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేయడం ద్వారా ప్లాంట్‌ను నిర్వీర్యం చేసి సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్రం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లు 928వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం వైజాగ్ నేషనల్ యాజిటేషన్ కమిటీ సభ్యులు దీక్షకు సంఘీభావం తెలిపారు. కమిటీ సెక్రటరీ ఎ.వి.ఎస్.ఎం అప్పారావు మాట్లాడుతూ కార్మికులకు తక్షణం మినిమమ్ పెన్షన్ రూ.7500 డీఏతో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ నాయకుడు గంగాధర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాగానే మినిమమ్ పెన్షన్ ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను పునరుద్ధరించాలని వినతి


డీటీ వెంకట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ శీరం అప్పలరాజు తదితరులు

సబ్బవరం: మండలంలోని పైడివాడ అగ్రహారంలో ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా అక్రమణకు గురైన శ్మశానవాటిక స్థలాన్ని తిరిగి కేటాయించి అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎంపీటీసీ శీరం అప్పలరాజు తదితరుల డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌కు వినతిపత్రం అందజేశారు. పైడివాడ అగ్రహారం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 128/1లో సుమారు 70 సెంట్లు శ్మశాన వాటిక స్థలం ఉందన్నారు.అయితే ఈ స్థలాన్ని ఇటీవల వీఎంఆర్‌డీఏ అధికారులు చదును చేసి అందులో నుంచి ల్యాండ్ పూలింగ్‌లో భూముల ఇచ్చిన రైతులకు ఇచ్చే ప్లాట్‌లకు 40 అడుగుల రోడ్డు ఏర్పాటు చేసి మిగిలిన స్థలాన్ని ఖాళీగా ఉంచారన్నారు. శ్మశానవాటికకు హద్దులు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, గ్రామ పెద్దలు గొంతిన పైడిరాజు,అక్కిరెడ్డి దుర్గినాయుడు, ఆర్‌పి నాయుడు, కోన సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సింహగిరి వర్తకులకు న్యాయం చేయండి

ఏడీసీని కోరిన వర్తక సంఘం నాయకులు


ఏడీసీ రామచంద్రమోహన్‌ను సత్కరిస్తున్న సింహగిరి వర్తక సంఘం నాయకులు

సింహాచలం: సింహగిరి దివ్యక్షేత్రం అభివృద్ధి పనులకు సహకరించిన వ్యాపారులకు న్యాయం చేయాలని సింహగిరి వర్తక సంఘం నాయకులు సోమవారం రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను కోరారు. సింహగిరిపై ప్రసాద్ స్కీమ్ పనులను పరిశీలించేందుకు వచ్చిన రామచంద్రమోహన్‌ను వర్తకులు కలిశారు. ప్రసాద్ స్కీంలో నిర్మించే నూతన షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి వర్తకుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. షాపులన్నీ ఒకే పొడవు, వెడల్పుతో నిర్మించాలనికోరారు. 50 శాతం అద్దె పెంపుదల ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. దీనిపై ఏడీసీ స్పందిస్తూ బుధవారం దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వర్తకులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఏడీసీని కలిసిన వారిలో వర్తకల సంఘం అధ్యక్షుడు మొగ్గ కిరణ్, ఉపాధ్యక్షుడు సానబోయిన రాజు, కోశాధికారి దొంతల శంకర్ తదితరులు ఉన్నారు.

30న సీపీఎం సమరభేరి


సినిమాహాలు కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

పరవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో సమరభేరి పేరుతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సీపీఎం నాయకుడు కె.నాయుడు అన్నారు. పరవాడ సినిమాహాలు కూడలిలో విద్యుత్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా విష్ణువర్ధన్, రామకృష్ణ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు, అధిక ధరల భారం పై ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి 31 వరకు ప్రచారం, సంతకాల సేకరణ, 1న సచివాలయాల వద్ద ధర్నాలు చేపట్టి వినతి పత్రాలు సమర్పించడం జరుగుతుందన్నారు. 4న జిల్లాలో అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

'జగనన్నకు చెబుదాం'కు 11 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

సింహాచలం: జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 11 వినతులు అందాయని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- చినముషిడివాడలోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ తొలగించాలని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత ఫిర్యాదు చేశారు.
- 97వవార్డు పరిధిలోని సాయిప్రాజెక్ట్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ మురుగునీరు కాలనీలోకి వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సుభద్రగార్డెన్ కాలనీకి చెందిన టి.సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు.
- లక్ష్మీనగర్ ఎఫ్‌బ్లాక్‌లో కాలువలు ఏర్పాటు చేయాలని ఎం.మోహన్‌రావు వినతిపత్రం అందజేశారు.
- ఇంటిపన్నుకు సంబంధించి పేరు తప్పుగా పడిందని, సరిచేయాలని చినముషిడివాడ దరి శ్రమశక్తినగర్‌కి చెందిన బి.అక్కమ్మ కోరారు.

డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, వోకల్, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ తదితర పీజీ డిప్లమా, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ సంస్థలో సంయుక్తంగా సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు.

కోర్సుల వివరాలు

ఆడియో ఇంజనీరింగ్-మ్యూజిక్ ప్రొడక్షన్ కోర్సులో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, డిప్లమాకు రూ.50 వేలు, పీజీ డిప్లమాకు రూ.1.5 లక్షలు ఫీజుగా ఉంటుందన్నారు. ఫిల్మ్ ఎడిటింగ్-డబ్బింగ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, వోకల్ ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.20 వేలు, డిప్లమాకు రూ.35 వేలు, పీజీ డిప్లమాకు రూ.70 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఉంటాయన్నారు. ఆడియో ఇంజనీరింగ్‌లో 50 మందికి, ఫిల్మ్ ఎడిటింగ్‌లో 25 మందికి, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో 50 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సెప్టెంబర్ 11వ తేదీలోగా అందించాలని, 14న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.audoa.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

హోరాహోరీగా ప్రచారం


భెల్ పరిపాలనా భవనం

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 31న జరగనున్న భెల్ (హెచ్‌పీవీపీ)విశాఖపట్నం యూనిట్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో మూడు యూనియన్లు బరిలో నిలిచాయి. ఉదయించే సూర్యుడి గుర్తుతో సీరియల్ నంబర్ 2గా బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్, సింహం గుర్తుపై సీరియల్ నంబర్ 3తో యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) యూనియన్ పోటీ చేస్తున్నాయి. మూడో యూనియన్‌గా బీఎంఎస్ పిడికిలి, చక్రం, వరికంకి గుర్తుతో సీరియల్ నంబర్ 1తో పోటీలో నిలిచింది. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా అంగస్వామి ఉంటారని బీఎంఎస్ యూనియన్ వర్గాలు తెలిపాయి.

- బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ నుంచి అధ్యక్షుడిగా సీఐటీయూ నుంచి జి.టి.పి.ప్రకాష్ , ప్రధాన కార్యదర్శిగా ఉరుకూటి బాబూరావు, గౌరవ అధ్యక్షుడిగా జి.సంజీవ రెడ్డి, చీఫ్ పేట్రన్లుగా దామోదర్ రెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు పోటీ చేస్తున్నారు.
- యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) నుంచి అధ్యక్షుడిగా బీహెచ్‌పీవీ ఎంఎస్ నుంచి బొండా బాబూరావు, టీఎన్‌టీయూసీ నుంచి సుభాకర్ సాహు, గౌరవ అధ్యక్షుడిగా మహాదేవన్, ఉప గౌరవ అధ్యక్షుడిగా బీఈఆర్‌పీటీయూ నుంచి కొల్లి దేముడు బరిలో నిలిచారు.

విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం

- ఆ విధంగా సిలబస్ రూపకల్పన అవసరం
- ఆధునిక సాంకేతికత విద్యార్థులకు చేరువ చేయాలి
- బీవోఎస్ సమావేశంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం చేసే విధంగా సిలబస్ రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన వార్షిక బీవోఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీ ఆవిష్కరణలు, మార్పులను రాష్ట్ర యువతకు చేరువ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారన్నారు. ఆ దిశగా పని చేస్తూ అన్ని కోర్సుల్లో ఐటీ సబ్జెక్టులను మిళితం చేయాలన్నారు. డేటా సైన్స్, మెషీన్ ఇంటెలిజెన్స్ వంటివి నేటి తరానికి అందించాలన్నారు. ప్రోగ్రెసివ్ థింకింగ్ కలిగి ఉండాలని ఇటీవల ముఖ్యమంత్రి ఉపకులపతులకు దిశానిర్దేశం చేసారని గుర్తు చేశారు. అలాగే ఓపెన్ బుక్ సిస్టమ్‌ని ప్రవేశ పెట్టాలని సూచించారన్నారు. పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులు తమ సొంత ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలను అన్వేషించడం దీంతో సాధ్యపడుతుందన్నారు. ఇకపై ప్రతి సెమిస్టర్ ఆరంభంలో సిలబస్ మార్పులపై చర్చించేలా ఏడాదిలో రెండు పర్యాయాలు సమావేశం కావాలని సూచించారు. పేటెంట్ల సాధన, నూతన ఉత్పత్తుల తయారీతో పాటు మరింత ప్రగతిని సాధించే దిశగా యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దడంలో ఏయూ ముఖ్య భూమిక పోషించాల్సి ఉందన్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి, సమస్యల నుంచి ఉపశమనం కలిగించే విధంగా వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. ఇన్నోవేషన్‌లో ఏయూ జాతీయ స్థాయిలో 13వ స్థానంలో నిలచిందన్నారు. రానున్న కాలంలో తొలి 10 స్థానాలలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన విద్య విధానం-2020లో సూచించిన విధంగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెంచుతూ సిలబస్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాళ్లు ఎ.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్ర ప్రసాద్, జి.శశిభూషణరావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, కె.వి శ్వేశ్వరరావు, ఎస్.కె.భట్టి పాల్గొన్నారు.